నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్




## అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల, నాయకులు

నిర్మల్ అర్బన్, జూన్ 29 : నిర్మల్ పట్టణంలోని జయశంకర్ చౌరస్తాలో చేపడుతున్న పౌంటెయిన్ మరమ్మతుల అభివృద్ధి పనులను శనివారం ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ.. పౌంటెయిన్ ఎత్తును తగ్గించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గండ్రత్ రమణ, పూదరి రాజేశ్వర్, లక్కాకుల నరహరి, ఎడిపెల్లి నరేందర్, తౌహీద్ ఉద్దీన్, ముజాయిద్, అబ్రార్, నాయకులు మేడారం ప్రదీప్ పాల్గొన్నారు.

## డబ్ల్యూహెచ్‌వో బృందం పర్యటన



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అబ్దుల్ వసి

ఎదులాపురం, జూన్ 29 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి పీహెచ్‌సీని శనివారం డబ్ల్యూహెచ్‌వో బృందం సభ్యులు అబ్దుల్ వసి, అజయ్‌లు సందర్శించారు. బీపీ, షుగర్, ఇతర వ్యాధుల వారికి ఇచ్చే మందుల రికార్డులను పరిశీలించారు. మందుల నిల్వ, రోగుల కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ నోడల్ అధికారులు యశోద, బొమ్మెత సుభాష్, సూపర్ వైజర్లు లక్ష్మి, శ్యామల, వసంత, 13వ సబ్ సెంటర్ల ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్ ప్రేమ్‌సింగ్, స్టాఫ్ నర్సులు గంగామణి, ప్రతిమ పాల్గొన్నారు.

## నీలి విప్లవంపై నీడలు



- పంపిణీకాని ఉచితంగా అందించే చేపపిల్లలు
- కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాలు కరువు
- ఆందోళనలో మత్స్యకారులు
- ఉచితంగా అందించిన కేసీఆర్

◄ చేపలు పడుతున్న మత్స్యకారులు



### సీజన్ ప్రారంభమై నెల రోజులు

ఆదిలాబాద్, జూన్ 29(నమస్తే తెలంగాణ) : వానకాలం ప్రారంభమై నెల రోజులు అవుతున్నది. మత్స్యకారుల ఉపాధి కల్పనలో భాగంగా ఉచితంగా అందించే చేప పిల్లల పంపిణీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. చేపలు పట్టడానికి వలలు, ఇతర సామగ్రి, మార్కెటింగ్ కోసం ఫోర్, టూ వీల్లర్సను అందజేసింది. చెరువులు, ప్రాజెక్టుల్లో చేపలు పెంచుతూ వారు ఉపాధి పొందారు. జిల్లాలో 95 మత్స్యకార సహకార సంఘాలు ఉండగా వీటిలో 4,500 మంది సభ్యులు ఉన్నారు. గతేడాది 224 చెరువుల్లో 1.18 కోట్ల చేప పిల్లలను వదిలారు. జిల్లాలోని సాత్నాల, మత్తడి ప్రాజెక్టులతోపాటు చెరువుల్లో వేసిన చేప పిల్లలు బాగా పెరిగాయి. ఈ ఏడాది ఎండకాలంలో చేపల మార్కెటింగ్ ప్రారంభం కాగా మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి చేపలను కొనుగోలు చేశారు. గతేడాది చేపట్టిన చేప పిల్లలు పెంపకం వల్ల జిల్లాలో రూ.40 కోట్ల వరకు విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

### లబ్ధిదారుల్లో ఆందోళన

గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏటా వానకాలానికి ముందుగానే జిల్లాలో చేపల పెంపకానికి అనుకూలంగా ఉన్న చెరువులు, ప్రాజెక్టుల, ఇతర నీటి వనరుల వివరాలను సేకరించేలా చర్యలు చేపట్టింది. ముందుగా చెరువుల, ప్రాజెక్టులను గుర్తించి లబ్ధిదారుల సూచనల మేరకు వివిధ రకాల పిల్లలను చెరువుల్లో వదిలేవారు. పంపిణీలో భాగంగా జిల్లాకు ఎన్ని చేప పిల్లలు అవసరమనే నివేదికలు ప్రభుత్వానికి పంపేవారు. జూన్ చివరికల్లా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి చేప పిల్లల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేసేవారు. చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, సామర్థ్యం మేరకు మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసింది. కట్ల, రాహు, బంగారుతీగ, మృగాల లాంటి చేప పిల్లలను చెరువుల్లో పెంచడానికి 35 ఎంఎం నుంచి 40 ఎంఎం సైజు గల పిల్లలను పంపిణీ చేశారు. వానకాలం ప్రారంభమైన దాదాపు నెల రోజులు అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు మత్స్యశాఖ అధికారులకు ఈ ప్రక్రియకు సంబంధించిన ఆదేశాలు రాలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి తమకు ఉచితంగా చేప పిల్లలు సరఫరా జరుగుతుందా? లేదా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు చేప పిల్లలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

### ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు..



*ఆదిలాబాద్ జిల్లాలో మత్స్యకారుల ఉపాధిని మెరుగుపర్చడంలో భాగంగా ఈ ఏడాది 230 చెరువుల్లో చేపల పెంపకానికి ప్రణాళికలు తయారు చేశాం. చేప పిల్లల పంపిణీ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈసారి చెనాక, కొరాట ప్రాజెక్టులో చేపపిల్లలను వదలడానికి చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారులకు ఉపాధి లభించింది.*

**- సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఆదిలాబాద్**

## చేతులెత్తేశారు..!

- పడకేసిన పల్లె పాలన
- పంచాయతీల ఖాతాలు ఖాళీ
- వీధి దీపాలు, తాగునీటి మరమ్మతులకు కష్టాలు
- పారిశుధ్య కార్మికులకు జీతాలు కరువు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీల నిర్వహణ
- కంపుకొడుతున్న గ్రామాలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



భైంసా మండలంలోని కుంసార రోడ్లపైనే పారుతున్న మురికినీరు



నీరు నిలిచి పాకురుతో నిండిన తాగునీటి ట్యాంకు

నిర్మల్, జూన్ 29(నమస్తే తెలంగాణ) : పల్లె పాలన పడకేసింది. గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం గ్రామాల్లో వీధి దీపాలు, తాగునీటికి సంబంధించిన బోర్లు, పైపులైన్లకు మరమ్మతులు చేసే పరిస్థితి లేదు. పంచాయతీ కార్యదర్శులకు పారిశుధ్య నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారింది. కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలిచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మురికి కాలువలను శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం సవాల్‌గా మారింది. కరెంటు బిల్లులు భారంగా మారాయి. చేసేదేమి లేక స్పెషలాఫీసర్లు చేతులెత్తేశారు. చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శులే అప్పులు చేసి కనీస అవసరాలు తీర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. పెద్ద పంచాయతీల్లో కొంతవరకు బాగానే ఉన్నా, వెయ్యి లోపు జనాభా ఉన్న పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. అసలే వానకాలం కావడంతో పారిశుధ్య నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు తలకుమించిన భారంగా మారుతున్నది. జిల్లాలోని పంచాయతీల నిర్వహణకు ప్రతి నెల రూ.5.50 కోట్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు నయా పైసా మంజూరు చేయకపోవడంతో పల్లెపాలన పూర్తిగా గాడి తప్పుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు, తండాల అభివృద్ధికి పల్లె ప్రగతి ద్వారా కోట్లాది రూపాయలను వెచ్చించడంతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ఎటు చూసినా అద్దాల్లా మెరిసే రోడ్లు, రోడ్లకు ఇరువైపులా పచ్చని చెట్లు, డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గ్రామాలు పరిశుభ్రమైన వాతావరణంతో కనువిందు చేసేవి. కానీ.. ప్రస్తుత ప్రభుత్వంలో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.



భైంసా మండలం మీర్జాపూర్‌లో తాగునీటి ట్యాంకు నుంచి లీకవుతున్న నీరు

### జిల్లాలో 396 పంచాయతీలు..

నిర్మల్ జిల్లాలో 396 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో వెయ్యి లోపు జనాభా ఉన్న పంచాయతీలు 195 ఉన్నాయి. కాగా, ఈ ఏడాది జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన మొదలైంది. జిల్లాలో మొత్తం 178 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నుంచి వచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆధారాలు. కాగా, కొంత కాలం నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. ఇక జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికీ రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేస్తున్నది. ప్రత్యేక అధికారులు వచ్చినప్పటి నుంచి అవి కూడా రావడం లేదు. అలాగే పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు, తైబజార్, గృహ నిర్మాణ ఫీజులు, వ్యాపార, వాణిజ్య లైసెన్సు ఫీజుల రూపేనా కొంత ఆదాయం సమకూరుతున్నది. కానీ, చిన్న పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు తప్ప ఇతర ఆధారాలు లేవు. చాలా గ్రామాల్లో ఇంటి పన్నులు కట్టేందుకు కూడా ప్రజలు ముందుకు రావడం లేదు. ముఖ్యంగా ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్, తాగునీటి పైప్‌లైన్లు, బోర్ల మరమ్మతులు, కరెంటు బిల్లులు, విద్యుత్ బల్బులు, డంప్‌యార్డు నిర్వహణ, పారిశుధ్య కార్మికుల జీతాలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. అయితే వీటికి వనరులు లేక నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని పంచాయతీల్లో దాదాపు 1,600 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో చాలా మందికి మూడు, నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదు. ఈ క్రమంలో ప్రత్యేక అధికారులు కనీసం పంచాయతీల వైపు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. గతంలో చెత్త ఏరివేత కోసం ట్రాక్టర్లు, ఆటోలు కొనుగోలు చేశారు. ఇవి సంబంధిత పంచాయతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఈఎంఐ కట్టకపోతే వారి సొంత ఖాతాలకు చెందిన సిబిల్ స్కోరు పడిపోతుందని వాపోతున్నారు. దీంతో వారి అవసరాలకు బ్యాంకు నుంచి అప్పు పుట్టని పరిస్థితి నెలకొన్నదని చెబుతున్నారు.

### నిధులు విడుదల చేయాలని కోరాం..

*జిల్లాలోని చిన్న పంచాయతీలకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు సకాలంలో రావడం లేదు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేయడంతో కొంతవరకు ఇబ్బందిని అధిగమించగలిగాం. రాబోయే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను కూడా జూలై నెలలో వసూలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈ పన్నులు వసూలైతే మరో రెండు, మూడు నెలల వరకు పంచాయతీల నిర్వహణకు ఇబ్బంది ఉండదు. జిల్లాలో 25 శాతానికి పైగా పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సంబంధించిన జీతాలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు.*

**- శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి, నిర్మల్.**

## రాథోడ్ రమేశ్ హఠాన్మరణం

- ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర
- జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



రాథోడ్ రమేశ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జడ్పీ చైర్మన్ జనార్దన్

ఆదిలాబాద్, జూన్ 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ (57) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఉట్నూర్‌లో ఉదయం ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోమాలోకి వెళ్లిన ఆయనను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ఇచ్చోడ వద్ద గుండెపోటుతో మరణించారు. తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించి, 35 ఏండ్లు సుదీర్ఘంగా తన రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా జిల్లా ప్రజలకు సేవలు అందించి ప్రజల్లో మంచి నాయకుడిగా నిలిచారు. 1989లో నార్నూర్ జడ్పీటీసీగా విజయం సాధించిన ఆయన రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. 1999లో ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2006లో ఆసిఫాబాద్ నుంచి జడ్పీటీసీగా గెలిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. జిల్లా వ్యాప్తంగా ఆయనకు రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయి. 2021లో బీజేపీలో చేరిన రాథోడ్ రమేశ్ గతేడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో బీఆర్‌జీఎఫ్ ద్వారా గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, చెక్‌డ్యాంల నిర్మాణానికి విశేషంగా కృషి చేశారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకమై వారి సమస్యల పరిష్కారంలో ముందుగా ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీలో ఉంటూ రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సన్నిహితంగా ఉంటూ పార్టీలో కీలక పదవులు నిర్వహించారు.



రాథోడ్ రమేశ్ (ఫైల్)

### నివాళులర్పించిన నాయకులు

రాథోడ్ రమేశ్ అకాల మరణంతో కార్యకర్తలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రమేశ్ మృతి తీరని లోటన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కూడా సంతాపం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, ఖానాపూర్‌లోని అభిమానులు చివరి చూపు కోసం బారులు తీరారు. ఉట్నూర్ పట్టణంలో వ్యాపారులు సంపూర్ణంగా బంద్ నిర్వహించి తమ అభిమానాన్ని చాటారు. అభిమానుల తాకిడితో అంగడీబజార్ రద్దీగా మారింది. కాగా.. నేడు(ఆదివారం) ఉట్నూర్ ఎక్స్‌రోడ్‌లో గల ఆయన వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## బొగ్గు గనుల వేలం ఆపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్
- బీజేపీకి వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా




కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

ఎదులాపురం, జూన్ 29 : మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాకుల వేలాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపాలని, నేరుగా సింగరేణి కంపెనీకి అప్పగించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట బొగ్గుగనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. గతంలోనే మోదీ ప్రభుత్వం నాలుగు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించిందని మండిపడ్డారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలం పాట ప్రక్రియను ప్రారంభించడం అన్యాయం అన్నారు. బొగ్గు బ్లాకులన్నీ ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముందన్నారు. క్రమంగా సింగరేణి సంస్థ బలహీనబడి మూతపడే వైపు మోదీ ప్రభుత్వం నెట్టుతున్నదన్నారు. ఈ ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు అడ్డుకోవాలని సీపీఎం పార్టీ కోరుతుందన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కదలాలని కోరారు. పదేండ్లలో మోదీ ప్రభుత్వం సుమారు 200 బొగ్గు బావులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, కిరణ్, సచిన్, నాయకులు మంజుల, స్వామి, ఆశన్న, పోచక్క, తదితరులు ఉన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

### సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 29 : ధరణి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ సంపత్ పాల్గొన్నారు.

### నిర్మల్‌లో..

నిర్మల్ అర్బన్, జూన్ 29 : ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం సీసీఎల్ఏ కార్యదర్శి నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, కలెక్టర్ ఏవో సూర్యారావు పాల్గొన్నారు.

## బాలిక మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందని బంధువుల ఆరోపణ
- భైంసాలోని ప్రైవేట్ దవాఖాన ఎదుట ధర్నా



మృతి చెందిన పల్లవి(ఫైల్)

భైంసా, జూన్ 29 : భైంసా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పల్లవి(14) అనే బాలిక శనివారం మృతి చెందింది. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని బంధువులు ఆసుపత్రి ఎదుట గల రోడ్డుపై ధర్నా నిర్వహించారు. బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. కుభీర్ మండల కేంద్రానికి చెందిన శంకర్-విజయల కూతురు పల్లవి కడుపునొప్పితో బాధపడుతుండగా శుక్రవారం భైంసాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యుడు అపెండిక్స్ ఉందని ఆపరేషన్ చేసి తొలిగించాలని సూచించినట్లు పేర్కొన్నాడు. దీంతో సాయంత్రం 6 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లగా దాదాపు మూడు గంటలపాటు ఆపరేషన్ చేసినట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం బాలిక పరిస్థితి విషమించి మృతి చెందింది. దీంతో ఈ విషయమై వైద్యుడిని అడిగితే చిన్న పేగుకు చీము వచ్చిందని బీపీ తగ్గిపోయి సెప్టిక్ షాక్‌తో మృతి చెందిందని చెప్పినట్లు కుటుంబీకులు తెలిపారు. వైద్యుడి వివరణతో సంతృప్తి చెందని బాలిక బంధువులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలిస్తామని చెప్పగా బాలిక బంధువులు ససేమిరా అన్నారు. స్థానిక వైద్యులపై తమకు నమ్మకం లేదని నిర్మల్‌కు తరలించాలని చెప్పడంతో వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించగా ఆందోళన విరమించారు. బాలిక తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


